క్లుప్తంగా

సేవలోనే సంతృప్తి



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మార్కండేయులు

విజయనగరం ఫోర్ట్: పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి ఉందని ప్రముఖ వ్యాపారవేత్త పెంటపాటి మార్కండేయులు అన్నారు. కణపాక మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో శనివారం 100 మంది పేదలకు బియ్యం, గోధుమ నూక, పంచదార పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెంటపాటి రాము, గుత్తురు చంద్రశేఖర్, తులసీరామ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడికి నవనీత సేవ



నవనీత సేవలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీనివాసుడు

విజయనగరం టౌన్: పట్టణంలోని కంటోన్మెంట్ అరుంధతీనగర్‌లో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని స్వామివారికి నవనీత సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు రాజేష్‌కుమార్ ఆచార్యులు, వెంకట నరసింహాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామివారికి నవనీతసేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

సకాలంలో రీ సర్వే



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ

పూసపాటిరేగ: భూ రీసర్వే సకాలంలో పూర్తి చేయాలని కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. సూర్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూ రీసర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూసర్వేలో ముందుగా మ్యాప్ తయారు చేయాలన్నారు. సర్వే నెంబర్ల వారీగా జిరాయితీ, ప్రభుత్వ భూమి, బంజరు, డీ పట్టా భూములకు సంబంధించిన యజమానులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల అడ్డగింత



కాలువ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న కాలనీవాసులు

భోగాపురం: మండలంలోని ముంజేరులో పంచాయతీరాజ్ శాఖ అధికారులు చేపట్టిన కాలువ నిర్మాణ పనులను సిద్ధార్థనగర్ కాలనీకి చెందిన ప్రజలు శనివారం అడ్డుకున్నారు. గ్రామస్తుల వాడుకనీరు మా కాలనీలోకి చేరుతుందని, మురుగునీటిని బయటకు మళ్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. కాలువ పనులు అడ్డుకోవడంతో అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఇన్‌చార్జ్ ఎస్సై మహేష్ గ్రామానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. గ్రామ పెద్దలు, కాలనీవాసులు మాట్లాడుకుని, ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత కాలువ పనులు చేపట్టాలని ఎస్సై అధికారులకు సూచించారు.

జగన్నాథ ఆలయంలో తిరు అధ్యయన మహోత్సవాలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: పట్టణంలోని సంతపేట జగన్నాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త నమ్మాళ్వార్ దివ్య తిరు అధ్యయన మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ద్రవిడ వేద పండితుడు గుదిమెళ్ల అనంత వెంకట జగన్నాథాచార్య స్వామి ప్రత్యక్ష నిర్వహణలో కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు పవన్, సామవేద పండితులు ప్రసాద శర్మ, నరసింహమూర్తి, జగన్నాథ సేవా సమితి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

భోగాపురం: మండలంలోని పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ కర్రోతు వెంకటరమణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు టి.చక్రవర్తి, జి.లక్ష్మయ్య శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మరో అవకాశం ఇవ్వండి..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి , నగర మేయర్

విజయనగరం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను గెలిపించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని ఒకటో డివిజన్ పరిధి కుసుమ హరనాథ్ క్షేత్రం ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. జగనన్న పాలన ఎలా ఉందని ప్రజలను అడగ్గా...వారంతా సంతోషంగా ఉన్నట్లు చెప్పడంతో కోలగట్ల ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే పథకాల సొమ్ము జమ చేయడం దేశంలో మన రాష్ట్రంలోనే జరుగుతోందన్నారు. ఒకటో డివిజన్ నాయకుడు ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోందన్నారు. ప్రభుత్వ పథకాల మంజూరుతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుని ఎమ్మెల్యే కోలగట్ల పరిష్కరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ఆరో డివిజన్‌లో పర్యటిస్తున్న కోలగట్ల, తదితరులు

ఆరో డివిజన్‌లో...

నగరంలోని ఆరో డివిజన్ ప్రశాంతినగర్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి ఒక్క జగన్ మోహన్‌రెడ్డేనని చెప్పారు. ప్రజలందరూ సంతోషంగా ఉంటే చూడలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, తదితరులు

పూసపాటిరేగ: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని భోగాపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రాజేశ్వరి అన్నారు. మండలంలోని నడిపల్లిలో సఖి కార్యక్రమంలో భాగంగా శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రక్తహీనత వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతున్నాయన్నారు. యుక్త వయసులో ఉన్న ఎంతోమంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని చెప్పారు. గర్భిణుల్లో రక్తహీనత ఏర్పడితే పుట్టబోయే బిడ్డలు అనారోగ్యం పాలవుతారని తెలిపారు. కార్యక్రమంలో నడిపల్లి సర్పంచ్ లంకలపల్లి గాయత్రి, ప్రజాప్రతినిధి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.అనిత, తదితరులు పాల్గొన్నారు.

మార్పు బాలకృష్ణమ్మకు ఘన నివాళులు



బాలకృష్ణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ఉపాధ్యాయ ఉద్యమ నేత మార్పు బాలకృష్ణమ్మ అని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి. ఈశ్వరరావు అన్నారు. మార్పు బాలకృష్ణమ్మ 10వ వర్ధంతి సభ శనివారం స్థానిక ఏపీటీఎఫ్ (1938) కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సదాశివరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ వాసులకు గ్యాస్ కనెక్షన్లు

నెల్లిమర్ల: నగర పంచాయతీ ప్రజలకు ప్రధాన మంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందజేయడానికి ఇండేన్ గ్యాస్ నిర్వాహక ఏజెన్సీ సహకరించాలని వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు కోరారు. పట్టణంలోని తూర్పుమహారాజుపేట, థామస్‌పేట కాలనీ వాసులకు మంజూరైన ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు శేఖర్, స్థానిక కౌన్సిలర్లు పైల భారతి, మొయిద శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పైల మురళి, మజ్జి గణేష్, పాండ్రంకి సత్యనారాయణ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి పింఛన్ అందజేత



రాజారావుకు పింఛన్ అందజేస్తున్న వైస్ చైర్మన్ రామారావు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన ఓ కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ప్రభుత్వం మంజూరుచేసిన రూ.10 వేల పింఛన్‌ను వైస్ చైర్మన్ సముద్రపు రామారావు శనివారం అందజేశారు. కనకల రాజారావు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈయనకు ప్రభుత్వం తాజాగా పింఛన్ మంజూరు చేయడంతో రాజారావు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే స్థానిక ఐదు వార్డుల్లో మంజూరైన 33 కొత్త పింఛన్లను కూడా లబ్ధిదారులకు రామారావు పంపిణీచేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబరు మాత సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి



అవగాహన కల్పిస్తున్న ఎస్సీసీసీ జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని.. లక్ష్య సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్సీసీసీ జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని రామతీర్థం, కొత్తపేట పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరిత్యా నేరమని, వాటిని ప్రోత్సహించవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యమే 'సఖి' లక్ష్యం



మాట్లాడుతున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



నెల్లిమర్ల: సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రమణమూర్తి

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: బాలికలందరికీ విద్య, సంపూర్ణ ఆరోగ్యం సాధించడమే సఖి ముఖ్య ఉద్దేశమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ముందుగా సీడీపీఓ ప్రసన్నకుమారి సఖి కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, బాలికల రక్షణ, సంరక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అయితే క్షేత్రస్థాయిలో బాలికల ప్రవర్తన, ఆరోగ్య పరిస్థితి, మానసిక స్థితిగతులను తెలుసుకున్నప్పుడే కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి సంపూర్ణ పౌష్టికాహారం, ఆరోగ్యం చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించాలని తెలిపారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాలలో పోటీపడుతున్నప్పటికీ, అక్కడక్కడ వివక్షకు గురికావాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకువచ్చేందుకు బాలికల్లో మానసిక ధైర్యాన్ని నింపాల్సిన అవసరం అందరిపైనా ఉందని చెప్పారు. కిశోర బాలికలను గుర్తించి సఖి గ్రూపుల్లో చేర్పించి ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, యునిసెఫ్ ప్రతినిధి శివ, మండల విద్యాశాఖాధికారి రాజు, ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సఖి గ్రూపులు ఏర్పాటు చేయాలి..

నెల్లిమర్ల: మండలంతో పాటు నగర పంచాయతీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సఖి గ్రూపులను ఏర్పాటు చేయాలని ప్రత్యేకాధికారి ఎస్వీ రమణమూర్తి ఆదేశించారు. మండల స్థాయి, నగర పంచాయతీ అధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సచివాలయాల పరిధిలో 9 నుంచి 21 సంవత్సరాల మధ్య వయసున్న బాలికలు, మహిళలను గుర్తించాలన్నారు. అలాగే ఇటీవల వివాహం జరిగిన మహిళల వివరాలను కూడా సేకరించాలన్నారు. వారిలో రక్తహీనతతో ఎంతమంది బాధపడుతున్నారో తెలుసుకోవాలని సూచించారు. కిశోర బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించాలన్నారు. అన్ని పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బడి మానేసిన బాలికలను గుర్తించి, వారు తిరిగి పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సఖి గ్రూపుల ఏర్పాటు, లక్ష్యాలను ఐసీడీఎస్ అధికారులు వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ జి. గిరిబాల, తహసీల్దార్ కేవీ రమణరాజు, నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్, సీడీపీఓ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు



పూసపాటిరేగ: నడిపల్లిలో నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు



విజయనగరం రూరల్: లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

పూసపాటిరేగ:

జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. నడిపల్లిలో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు బిల్లులు వెంటనే చెల్లిస్తున్నట్లు చెప్పారు. లే అవుట్‌లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కల్యాణచక్రవర్తి, ఎంపీడీఓ రామరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వరరావు, సర్పంచ్ లంకలపల్లి గాయత్రి, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, లంకలపల్లి శ్రీనివాసరావు, వల్లంశెట్టి వెంకటప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

విజయనగరం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని జొన్నవలసలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడేళ్లలో ముప్పై లక్షల దబ్బై వేలకు పైగా ఇళ్లను నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దార్ సీహెచ్ బంగారురాజు, సర్పంచ్ కంది రమాదేవి, మండల శాఖ అధికారులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం పంపిణీ



మృతుడి భార్య సూర్యకాంతకు బీమా సొమ్ము అందిస్తున్న సర్పంచ్ సూర్యకాంత, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆత్మారాముని అగ్రహరంలో ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందిన జమ్ము అప్పలనాయుడు కుటంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయాన్ని శనివారం అందజేశారు. సర్పంచ్ మీసాల సూర్యకాంత చేతుల మీదుగా అప్పలనాయుడు భార్య అప్పయ్యమ్మకు రూ.10 వేల నగదు ఇచ్చారు.

వైఎస్సార్ బీమా కింద రూ. 5 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మీసాల తాతినాయుడు, శివ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలతో 'సంపద'



శిక్షణ పొందుతున్న మహిళలు

- ఆలయాల్లో వినియోగించిన పూలతో అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌ల తయారీ
- రామతీర్థం, అక్కివరం గ్రామాల్లో మహిళలకు శిక్షణ
- 15 రోజుల పాటు శిక్షణ అందించిన డీఆర్‌డీపీ అధికారులు
- తయారీ యూనిట్ల ప్రారంభానికి ఆర్థిక సాయం

నెల్లిమర్ల: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి, అభివృద్ధి దిశగా పయనించాలనే లక్ష్యంతో ఇప్పటికే ఎన్నో స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రారంభించిన ప్రభుత్వం.. తాజాగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో మాదిరిగా దేవాలయాల్లో పూజల నిమిత్తం వినియోగించిన పూలతో అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌లు తయారు చేయడానికి స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణను అందించింది. నెల్లిమర్ల నియోజకవర్గంలోని రామతీర్థం, డెంకాడ మండలం అక్కివరం గ్రామాలకు చెందిన మొత్తం 60 మంది మహిళలు శిక్షణ తీసుకున్నారు. రామతీర్థంలోని శ్రీరామస్వామి, గంట్లాంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారి అలంకారానికి వినియోగించిన పూలతో అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌లు తయారుచేసే యూనిట్లను త్వరలోనే ప్రారంభించనున్నారు. వివరాల్లోకి వెళితే.. నెల్లిమర్ల నియోజకవర్గంలోని రెండు ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలకు అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌ల తయారీ శిక్షణ కేంద్రాలను డీఆర్‌డీపీ – వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం, డెంకాడ మండలంలోని అక్కివరం గ్రామాల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటయ్యాయి. నాబార్డ్ సహకారంతో ఒక్కో కేంద్రంలో 30 మంది చొప్పున మహిళలకు 15 రోజుల పాటు శిక్షణ అందించారు. ఆలయాల్లో వినియోగించిన పూలతో అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌లు ఎలా తయారుచేయాలో స్రాకో సంస్థకు చెందిన నిపుణులు శిక్షణ ఇచ్చారు. ఈనెల 2వ తేదీతో రెండు గ్రామాల్లోని బ్యాచ్‌లకు శిక్షణ పూర్తయ్యింది. శిక్షణ పొందిన మహిళలతో త్వరలోనే అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌ల తయారీ యూనిట్లు ప్రారంభించడానికి డీఆర్‌డీపీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడానికి ముందుకొచ్చారు.

త్వరలో యూనిట్ ఏర్పాటు చేస్తాం.



రామతీర్థంలో గత నెల 15వ తేదీ నుంచి అందించిన శిక్షణలో అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌లు తయారు చేయడం నేర్పించారు. వాడిపోయిన పూలతో సువాసన వెదజల్లే పూజా సామాగ్రి ఎలా తయారు చేయాలో తెలుసుకున్నాను. నాతో పాటు మా గ్రామానికి చెందిన 30 మందికి శిక్షణ అందించారు. త్వరలోనే అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌ల తయారీ యూనిట్ ప్రారంభిస్తాం.

– కంచరాపు సూర్యకళ, సర్పంచ్, రామతీర్థం

స్వయం ఉపాధికి దోహదం..



అక్కివరంలో డీఆర్‌డీపీ ఆధ్వర్యంలో ఇచ్చిన అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌ల తయారీ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నాను. శిక్షణ నాకు ఎంతగానో ఉపయోగపడింది. పూల వ్యర్థాలతో పూజాసామాగ్రి ఎలా తయారు చేయాలో నేర్చుకున్నాను. స్వయం ఉపాధి యూనిట్‌ను త్వరలోనే ప్రారంభిస్తాం. మా గ్రామ మహిళల ఆర్థికాభివృద్ధికి శిక్షణ ఉపయోగపడుతుంది.

– పతివాడ ఉష, గణపతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు

15 రోజుల శిక్షణ..



రామతీర్థం, అక్కివరం గ్రామాల్లో 60 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు 15 రోజుల పాటు శిక్షణ అందించాం. ఆలయాల్లో వినియోగించిన పూలతో అగరబత్తీలు, ధూప్‌స్టిక్‌లు ఎలా తయారు చేయాలో నేర్పించాం

–ఎల్ సత్యనారాయణ, వైకేపీ ఏపీఎం